ఒక ఆదివారం మధ్యాహ్నం,

గోపాలం వంటింట్లో పీట వాల్చుకుని, మోకాళ్ళమీద మోచేతులాన్చి, ముక్కాలి పీట ముందు పెట్టుకుని కూర్చున్నాడు. జానకి పకోడీలు వేస్తోంది.

'డ్రీమ్ గర్ల్! ప్లేటు పకోడి' అన్నాడు గోపాలం నవ్వుతూ.

'డ్రీమ్ గర్ల్ లేదు, స్వీట్ గర్ల్ లేదు. అలా పిలవద్దన్నానా!' అంది జానకి చిరుకోపంతో.

'సారీ జాకీ! అయినా నువ్వు కోపంలో కూడా చాలా అందంగా ఉన్నావు.'

'అదుగో జాకీ ఏమిటి? కుక్కపిల్లను పిల్చినట్లు' అంది ప్లేట్లో పకోడీలు పెడుతూ.

పకోడీలు తింటూ ఫక్కుమని నవ్వాడు గోపాలం.

తెల్లబోయి చూసింది జానకి, బుగ్గన వేలుపెట్టి.

ఆ పోజుకోసమే నవ్వాడా అన్నట్లు నవ్వడం మానేసి, జానకిని చూస్తూ కూర్చున్నాడు గోపాలం.

'సరిపోయింది, తినండి' అంది జానకి.

'నే వేస్తాను' అన్నాడు గోపాలం ముందుకు వంగి.

'వీల్లేదు' అంది విక్కచ్చిగా జానకి.

'ఏం? ఎందుకు వీల్లేదు? మా ఆఫీసులో వాళ్ళంతా ఇంటిదగ్గర పకోడీలు వేయటంలా! మొన్న సుబ్బారావు ఎంత బాగా వేసాడు. వాడికంటే దద్దమ్మనా?'

'కాకపోవచ్చు. మీరు వేస్తే ఇంక తిన్నట్టే.'

'అహా! నువ్వేస్తే నే తినటంలా! నీకంటే మా బామ్మ చాలా మంచిది. ఎప్పుడు పకోడీలు చూసినా మీ బామ్మ జ్ఞాపకం వస్తుంది.' అన్నాడు గోపాలం.

'అలాగా! నే వేసే పకోడీలుమా బామ్మలా లేవే? ఎలా జ్ఞాపకం వస్తోందబ్బా!' అంది జానకి నవ్వుతూ.

'డర్టీ జోక్. సరే ఓ కథ చెప్పనా?' హారికథ దాసులా లేచి నుంచున్నాడు గోపాలం.


'అక్కర్లేదు. కూర్చోండి. ఈ ఆరు నెలల్లో అరవై కథలు చెప్పి బోరు కొట్టించారు' అంది జానకి నవ్వుతూ.

'ఆల్‌రైట్ బోరు కొట్టించను. పకోడీలు వేస్తాను.'

'వీల్లేదు.'

'అయితే కథ విను.'

'చచ్చినట్లు.'




# డ్రీమ్‌గర్ల్

టి. గోపాలకృష్ణ
శియమ్మీరావు

* * *

ఆఫీసులో జాయిన్ అయిన మర్నాటి సాయంత్రమే కాఫీ త్రాగి అద్దె ఇంటి అన్వేషణకు బయల్దేరాడు చిరుద్యోగి గోపాలం. క్రొత్తపేట, బ్రాడీపేట తిరిగిన గోపాలాన్కి సంసారులుండే ఇల్లు అద్దెకు దొరకలేదు. గోపాలం సిగరెట్ త్రాగుతూ ప్రతి ఇంటికేసి చూస్తూ తిరుగుతున్నాడు. అద్దె ఇంటి అన్వేషణలో ఉన్న కష్టాలు తెలియని చిన్నారి గోపాలాన్కి అనేక ఆశయాలు, కోరికలు సహజమైనవి ఉన్నాయి. మేడమీద గది అయితే బాగుంటుంది. వీటాచ్డు బాత్‌రూం, లేవెటరీ ఉండాలి. క్రింద బామ్మగారు ఇంటి ఓనర్ అయితే బాగుంటుంది. ఆమెకో మనమరాలు, మంచి కలర్ (అమ్మాయి) ఉంటే మరీ మంచిది. ఓహో! గట్టిగా దమ్ములాగి సిగరెట్ క్రిందపడేసి రోడ్డు ప్రక్కగా కన్పించిన

చూసాడు. తన ఆశయాలకు తగ్గట్టుగా కన్పించిందా డాబా. 'కాని, ఎక్కడా 'టులెట్' బోర్డు కనపడదే' సందేహం వచ్చింది గోపాలాన్కి. 'బహుశా, మర్చిపోయుంటారు' అని నిశ్చయించుకొని, నెమ్మదిగా గేట్ తీసుకొని లోపలకు వెళ్ళాడు. కాలింగ్ బెల్లు కనబళ్ళేదు. తలుపు గొళ్ళెం పట్టుకు బాదాడు.

సమాధానం లేదు.

'బామ్మగారూ!' అన్నాడు గట్టిగా. అన్న తర్వాత తెలిసింది తన పొరబాటు. తను ఊహాలోకంలో పడి 'బామ్మగారు' అని పిల్చాడు.

'కొంపతీసి ఎవరూ వినలేదు కదా!' అనుకున్నాడు గోపాలం.

'వస్తున్నా' అన్న సమాధానం వచ్చింది.

ఆ కంఠం ఆడో, మగో, చిన్నో, పెద్దో ఎవరిదో తెలియలేదు గోపాలాన్కి.

'బామ్మగారో, మనవరాలో' అని నిశ్చయించుకుని, కాలరు, షర్టు సరిజేసుకున్నాడు.

తలుపు తెర్చుకుంది. గోపాలం నిశ్చేష్టుడయిపోయాడు. నిజంగా బామ్మగారు

'నమస్కారమండీ' అన్నాడు వినయంగా గోపాలం.

'ఏంకావాలి నాయినా?' అందావిడ ముసుగు సవరించుకుంటూ, గోపాలం కాలర్ సవరించుకున్నట్టు.

'అబ్బే! ఏం లేదండీ. రూం ఏమైనా ఖాళీగా ఉందా అనండి' నసిగాడు.

'ఏం చేస్తున్నావు?'

'ఇక్కడే ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నానండి.'

బామ్మగారు గోపాలాన్ని ఒక్కక్షణం నిశితంగా చూసింది.

'సరే! మేడ మీద గది ఖాళీగా ఉంది. ఇంతవరకు అద్దె కివ్వాలనే ఉద్దేశ్యమే లేదు. మొన్ననే మా అబ్బాయి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళాడు. ఆ మధ్యే ఖాళీ అయ్యింది. సరే, పైకి రా' అంది.

గోపాలం మనస్సు మనస్సులో లేదు. 'బామ్మగారు, మేడ మీద గది, బహుశ, బామ్మగార్కి మనమరాలు ఉండే ఉంటుంది. బాబోయ్! తనకు కథల్లో హీరో లక్షణాలు చాలా ఉన్నాయి. ఎల్లాగైనా ఈ రూం సంపాదించాలి, బామ్మగార్ని కాకా

# డీమ్ గర్ల్

పట్టాలి' గోపాలం ఆలోచిస్తున్నాడు.

బామ్మగారు మెట్లు ఎక్కుతోంది.

'జాగ్రత్త బామ్మగారు. మీరు మెట్లు ఎక్కలేరు' అన్నాడు గోపాలం.

'పర్వాలేదు నాయనా. పెద్ద కాలం కదా కొంచెం కష్టమే' అందావిడ.

'గట్టి పిండం' అనుకున్నాడు గోపాలం.

'బామ్మగారు! మిమ్మల్ని చూస్తుంటే నాకు ఒహాటే విచారంగా ఉందండి' అన్నాడు.

'ఏం పాపం?' అందావిడ నిస్తుబోయి, మెట్టుమీద నుంచొని.

'మా బామ్మ అచ్చం మీలాగే ఉండేదండి. నేనంటే పంచప్రాణాలు. మొన్నీమధ్యే స్వర్గస్థురాలయిందండీ' అన్నాడు గోపాలం వెక్కుతూ, చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు.

'బామ్మా! క్షమించు. కేవలం అద్దె ఇంటికోసమే అబద్ధం ఆడుతున్నాను. నీతోడు' క్షమార్పణ చెప్పుకున్నాడు నిక్షేపంలా బ్రతుకున్న బామ్మను తల్చుకుని గోపాలం.

'బాధపడకు నాయనా, బ్రతికినన్నాళ్ళు బ్రతకం కదా!' అందావిడ.

'చంపావుపో. నీతో పన్నా కలిపావ్. నాకు ఇరవై రెండు. ఇంకో ఇరవై రెండు బ్రతకనా? మన భారతీయుల సగటు జీవిత కాలం నలభై నాల్గు అని నీకెవ్వరు చెప్పారు బామ్మా?' అనుకున్నాడు కసిగా.

బామ్మగారు అవలీలగా మెట్లు ఎక్కి, రూం తాళాలు తీసింది. ఒక్కటే గది. గోపాలంకోసమే కట్టించినట్లు ఎటాచ్డ్ బాత్‌రూం, లేవట్రీ ఉన్నాయి. మంచి గాలి, వెలుతురు ఉన్నాయి. గోపాలాన్కి పట్టరాని సంతోషంగా ఉంది. అన్నీ ఉన్నాయి. ఇంక కావల్సింది, ఒక్క బామ్మగార్కి అందమయిన మనమరాలు ఉండటం. అది కూడా ఉంటే ఇంక తనంత అదృష్టవంతుడు నుండడు.

'నెమ్మదిగా దిగు నాయనా' అంది ఈసారి బామ్మగారు గోపాలాన్ని ఉద్దేశించి.

'బ్రహ్మాండమైన జోక్ బామ్మగారు' అందామనుకున్నాడు. కానీ, ఆవిడకు అర్థం కాదని ఊరుకున్నాడు. ఇదే ఆఫీస్‌లో అయితే ఆఫీసర్ నోరు తెరవగానే 'బ్రహ్మాండమైన జోక్ సార్' అని బ్రహ్మాండంగా నవ్వుండేవాడు.

బామ్మగారు క్షేమంగా మెట్లు దిగారు.

'కూర్చో నాయనా!' అందావిడ కుర్చీ చూపిస్తూ.

'అద్దెంత బామ్మగారూ!' అన్నాడు గోపాలం కూర్చుంటూ.

'ఆ! నీకు తెలియకనా నాయనా, యాభై మాత్రమే' అందావిడ బహు తేలిగ్గా.

'మరి, మనవరాలు ఉందా?' అందామను కున్నాడు గోపాలం.

కుర్చీలో కూర్చున్న గోపాలం చుట్టూ చూసాడు. గోడకు ఒక ఫోటో కనబడింది. లేచి గోడ దగ్గరకు వెళ్ళి నుంచున్నాడు. 'అమ్మాయి, అందమయిన అమ్మాయి, కలర్, ఈస్ట్‌మన్ కలర్, ఏది ఇంట్లో ఎక్కడా కనబడదే, బహుశ, కాలేజీకి వెళ్ళుంటుంది' గోపాలం ఊహాలోకంలో విహరిస్తున్నాడు.

'ఏం నాయనా ఎలా ఉంది?' బామ్మగారి ప్రశ్న.

'చాలా బాగుంది' అన్నాడు గోపాలం ఫోటో కేసి చూసి.

'ఏమిటి?' అందావిడ గోపాలం పరధ్యాన్నం కని పెట్టి.

'ఇల్లు' అన్నాడు సర్దుకుని.

'కాదు. అద్దె' అందావిడ.

'అంత బాగాలేదు.'

'ఏం?' బామ్మగారి ప్రశ్న.

'నేనా చిరుద్యోగిని. కొంచెం ఆలోచించుకోవాలి బామ్మ...గారూ.' కొంచెం బిగిసాడు బామ్మగారు అద్దె తగ్గిస్తుందేమోనని.

'సరే ఆలోచించు. అప్పటిదాకా ఉంటే నీకే నలభైకిస్తాను.' బామ్మ మహా గట్టిపిండం.

గోపాలం ద గ్రేట్ డైలమాలో పడ్డాడు. మేడమీద గది, బామ్మగారు, మనుమరాలు ...గోపాలం మనస్సులో గిర్రున తిరుగుతున్నారు. వెంటనే అయిదుపదులూ లెక్క పెట్టి.

'బామ్మగారూ! అడ్వాన్స్' అన్నాడు.

'నే అడగలే'

'తప్పదు. నామీద ఒట్టు. తీసుకోవాలి' మొహమాట పెట్టాడు.

బామ్మగార్కి తప్పలేదు.

'సరే, బామ్మగారు! రేపు సాయంత్రం

వస్తాను. నాకేమి సామాన్లు లేవులెండి ఒకపెట్టి, బెడ్డింగు... వెళ్ళొస్తానండి.' గోపాలం నమస్కారం పెట్టి, హుషారుగా బయటకు వచ్చాడు. ఆరోజు రాత్రి బామ్మ గారి మనుమరాలితో అరడజను డ్యూయెట్లు పాడి అలసిపోయాడు.

మర్నాటి సాయంత్రం నాలుగ్గున్నరకల్లా పెట్టి బెడ్డింగ్‌తోసహా రిక్షాలో తయారయ్యాడు గోపాలం. రిక్షాకు కిరాయిచ్చి పెట్టి బెడ్డింగు ఈడ్చుకుంటూ తలుపు దగ్గరకు జేరాడు. తలుపు తట్టగానే మళ్ళీ బామ్మగారే వచ్చింది 'రా నాయనా' అంటూ.

'డామిట్ ! ఈసారయినా మనమరాలు రాకూడదా !' అనుకున్నాడు.

ఈసారి బామ్మగారి మొహంలో నిన్నటి ఖుషీ లేదనిపించింది గోపాలాన్కి ఎందుకో.

'బామ్మగారూ ! గది తాళాలు ఇవ్వండి, పెట్టె పైన పెట్టివస్తాను' అన్నాడు గోపాలం.

'ముందు అలా కూర్చోనాయనా. పకోడీలు పట్టుకొస్తాను' అందావిడ.

'ఎందుకండీ ఇప్పుడవన్నీ' మొహమాట పడూ కూర్చున్నాడు.

బామ్మ రెండునిముషాల్లో పకోడీలు పట్టుకొచ్చింది.

## డ్రీమ్ గర్ల్

'బామ్మగారూ ! అలా ఉన్నారేమిటి ? ఆరోగ్యం బాగుండలేదా ?' గోపాలం కాకా ధోరణిలో అన్నాడు.

'ఏంలేదు నాయనా. ఆ కాఫీకూడా త్రాగు. తర్వాత చెప్తా' అందావిడే.

చచ్చాం. ఈవిడ ఆరోగ్యం గురించి బోర్ తుంది కాబోలు' అనుకున్నాడు గోపాలం.

'బామ్మగారూ ! ఈ లంకంత ఇంట్లో మీరొక్కరే ఉంటున్నారా ?' గోపాలం టాపిక్ మార్చాడు.

'లేదు. నేను, నా మనుమరాలు'

'నిజంగా వింత అదృష్టవంతుణ్ణి. అనుకున్నదేది అడ్డం తిరగటంలేదు' మురిసి పోయాడు గోపాలం.

'మంచిది' అన్నాడు.

'ఏమిటి ?' అందావిడ.

'అదే, మీరు మీ మనమరాలు హాయిగా ఉండొచ్చు' అన్నాడు.

'ఏం హాయిలే నాయనా. మొన్నటిదాకా మా అబ్బాయి, కోడలు ఉండేవారు. ఇప్పుడు వాళ్ళు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళి పోయారు. ఇప్పుడీ శిఖండి ఉంది. నా మనుమరాలు. అది నామాట వినదు. దాని పట్టు దానిదే'

'అమ్మమ్మ. అంతమాటనకండి. ఆడ పిల్లలకు పట్టుదల ఉండవల్సిందే. దాని తోటే వాళ్ళు పైకివస్తారు.'

'నీకు తెలియదు నాయనా దానిసంగతి. తెలిస్తే అలా అనవు' అందావిడ.

'మీరు వెయ్యి చెప్పండి. మీ మనుమరాలు మంచిది.'

'నీకేం తెల్సయ్యా!'

'ఆ ఫొటోలో ఉన్నమ్మాయేకదా! మొహం చూసాను.'

'సరే ! మంచిదికాదని నీచేత ఒప్పించనా ?' అన్నారు బామ్మగారు నవ్వుతూ.

'సరే'. అన్నాడు గోపాలం ఛాలెంజీగా.

'నిన్న నీవు బలవంతంగా అడ్వాన్స్ ఇచ్చావా. మా మనుమరాలు కాలేజీనుంచి రాగానే చెప్పాను. త్రాచుపాములా బుస్సు మంది.

'ఎవరితో చెప్పి ఇచ్చావు. బోడి యాభై రూపాయలకోసం అడ్డమైన వాళ్ళకు ఇస్తావా. ఇవ్వడాన్కి వీల్లేదు. రేపు ఆడబ్బు అతనిముఖాన కొట్టేయ్' అని నిన్నరాత్రి నిరాహారదీక్ష. ఇప్పుడు నీకు గది ఇస్తే ఆమరణ నిరాహారదీక్ష చేసినా ఆశ్చర్యపడ క్కర్లేదు' అంది బామ్మగారు పమత్కారంగా, నొచ్చుకుంటూ.

ఇప్పుడు నిజంగా గోపాలం ముఖంచూడాలి. కుర్చీలో అలాగే బిగిసిపోయాడు. బామ్మగారు మరచెంబులో నీళ్ళు పట్టుకొచ్చి ముఖానకొట్టింది. దాంతో నిజలోకంలోకి వచ్చిపడ్డాడు. 'మేడమీద గది. బామ్మగారు, మనమరాలు...గిర్రున తిరుగుతున్నారు బుర్రలో. లేచి నుంచున్నాడు. బామ్మగారు గోపాలం పరిస్థితి కనిపెట్టి, అయిదు పదిరూపాయల కాగితాలు జేబులో పెట్టింది. రెండడుగులు వేసాడు. పెట్టె, బెడ్డింగ్ చేతో పట్టుకొని. 'డామిట్ ! కథ అడ్డం తిరిగింది' అని గొణుక్కుంటూ బయటకు వచ్చాడు.

తిరిగి లాడ్జింగ్‌కు వచ్చి, తన మరి దృష్టాన్ని, మేడ మీద గదిని, బామ్మగార్ని, మనుమరాలిని తిట్టుకుంటూ నిద్ర పోయాడు. మర్నాటి ప్రొద్దున్న తలుపు చప్పుడు కావటంతో లేచి కూర్చున్నాడు.



వెళ్ళి తలుపు తీసేటప్పటికి అమ్మా నాన్న గార్లు ప్రత్యక్ష మయ్యారు. కొండంత ఆశ్చర్యమేసింది గోపాలాన్కి.

## డ్రీమ్ గర్ల్

'అలా చూస్తావేరా పోయి మొహం కడుక్కొని, నీళ్ళు పోసుకొని రా' అన్నారు. నాన్న వాళ్లను కూర్చోబెట్టి అరగంటలో తయారయ్యాడు.

'ఈ ఊళ్ళోనే రామచంద్రరావు అని నీకు మామయ్య అవుతాడులే, ఒకాయన ఉన్నాడు. వాళ్ళమ్మాయిని నీకు చూసు కోవటాన్కి రమ్మనమని ఉత్తరం రాసాడు. నిన్నుకూడ తీసుకెళ్దామని ఇలా వచ్చాం' తండ్రి విషయాన్ని వివరించాడు.

గోపాలాన్కి నిజంగా సంతోషంకల్గింది. పెళ్ళవుతున్నందుకు కాదు. అత్తారింట్లో అయినా ఉండొచ్చు, అద్దె ఇంట్లోలా ప్రాబ్లెమ్స్ ఉండవని.

తల్లీ, తండ్రి ఎక్కివచ్చిన టాక్సీ లోనే బయల్దేరారు. తిన్నగా బొమ్మగారింటి దగ్గరకు వచ్చేటప్పటికి ఆగి పోయింది టాక్సీ.

'ఏమయింది ?' అన్నాడు గోపాలం.

'ఏం కాలేదు. దిగు' అన్నాడు తండ్రి.

గోపాలం దిగి, జనకుని అనుసరించాడు. అది నిస్సందేహంగా బొమ్మగారిల్లే. నిన్న నిశ్శబ్దంగా ఉన్న బొమ్మగారిల్లు ఇవాళ కళకళలాడుతోంది. ఒకాయన గుమ్మంలో నుంచున్నాడు. రామచంద్రరావుగారుకాబోలు.

'రా బాబా !' అన్నాడాయన గోపాలం తండ్రినిచూసి.

ఆశ్చర్యసాగరంలో మునిగిన సామాన్య మానవుడు గోపాలం మంత్ర ముగ్ధుడులా ముందుకు కొట్టుకుపోయాడు. కొట్టుకు పోయినవాడు సోఫాలో కూలబడ్డాడు. కాఫీ, టిఫిన్‌లు అయినతర్వాత గోపాలం డ్రీమ్‌గర్ల్, ఫోటోలో సుందరి వచ్చింది. వచ్చిందల్లా ముడుచు కూర్చుంది. గోపాలం ఇహం మర్చి అల్లా కూర్చున్నాడు.

గోపాలాన్కి లేని జ్ఞా [ఘ్నా]నం గోపాలం తండ్రికుంది. అందుకే ఆయన 'పేర'డిగాడు.

'జానకి' అంది కోయిలలా.

'జానకి...జానకి' నెమరు వేసాడు గోపాలం, కాసేపటికి జానకి లోపలికి వెళ్ళి

పళ్లు—గుణాలు

# శీతాఫలము

మంచి రుచిగా ఉండే పళ్ళలో యిదొకటి. ఇది మొదట వేడిచేసి ఆ తరువాత చలువ చేస్తుంది. రక్తాన్ని, ఇంద్రియాన్ని వృద్ధి పొందిస్తుంది. హృదయానికీ, మెదడుకు బలాన్ని యిస్తుంది. కడుపులో ఉండే క్రిముల్ని వెడల గొట్టడానికి తోడ్పడుతుంది.

ఈ పండు గుంజును గడ్డలపై వేసి కట్టుకట్టే వట్లయిన అవి వేగంగా మెత్త బడి చితుకుతాయి.

ఈ పళ్ళు అధికంగా తింటే శ్లేష్మం, పైత్యం హెచ్చవుతాయి. అగ్ని మాంద్యంగల వారు అధికంగా తింటే జ్వరం వస్తుంది,

ఈ పండుయొక్క దుర్గుణాలకు విరు గుళ్ళు:— 1. మంచినీళ్ళు.

జుత్తుకి బాగా పేలు పట్టినట్లయితే —శీతాఫలములోని గింజలను మెత్తగానూరి ఆముదంతో జుత్తుకు పులమండి. పేలు చస్తాయి.

శీతాఫలపు విత్తులలోను ఆకులలోను, పచ్చి కాయలలోను పురుగులను చంపేగుణం ఉంది. వీటి రసాన్నిగాని, చూర్ణాన్నిగాని, పురుగులు పట్టిన పుళ్ళపై పూసినచో పురుగులు చస్తాయి.

కొంతమంది చిన్నపిల్లలకి విరేచనాలవడం వల్లగాని, గ్రహణివల్లగాని ఒక్కొక్కప్పుడు గుదస్థానమువద్ద పెద్ద ప్రేవు బయటకి వచ్చి వేస్తుంది. అలా ప్రేవు బయటకు వచ్చిన వాళ్లకు శీతాఫల ఆకుల కషాయాన్ని అగు మోతాదులో రోజూ రెండు పూటలా కొన్నాళ్లి పాటు యిస్తే క్రమక్రమంగా కొన్నాళ్లకు బయటకొచ్చిన గుద స్థానము లోనికి పోతుంది.

## రామాఫలం

రామాఫలం మొదట వేడిచేసి ఆతరువాత చలువ చేస్తుంది.

ఇది అంత పథ్యమయినది కాదు.

అగ్ని మాంద్యన్ని అంగశూలము, శిలో వాతాన్ని, పుట్టిస్తుంది. గురుత్వంగా ఉంటుంది. అంత సులభంగా జీర్ణంకాదు అధికంగా తింటే తలనొప్పి వస్తుంది.

ఈ పండుయొక్క దుర్గుణాలకు విరు గుళ్ళు:— 1. గులకందు, 2. కరక్కాయ మురబ్బా.

## నేరేడుపండు

మన ప్రాచీనులు మన దేశాన్ని జంబూ ద్వీపంగా పేర్కొన్నారు. ఒకప్పుడీ దేశంలో జంబూ వృక్షాలు అధికంగా ఉండేవి కాబోలు.

నేరేడి పళ్ళు మన శరీరానికి చాలామేలు చేస్తాయి. ఇవి చలువచేసి ఆర్పుతాయి. బాగా ఆకల్ని పుట్టిస్తాయి. పుంస్త్వాన్ని హెచ్చ స్తాయి. మేహశాంతి, పైత్య శాంతి, చేకూ రుస్తాయి. శిలో పైత్యాల్ని కఫ పైత్యాన్ని, మేహాన్ని, అణచి వేస్తాయి. వీర్య పుష్టిని స్తాయి. ఉష్ణ తత్వం గలవారి పొట్టకు బలాన్ని యిస్తాయి. రక్తంలోని వేడిని తగ్గిస్తాయి. నేరేడు పళ్ళు తింటే పిల్ల విరేచనాలు కడ తాయి. మూత్రపు సంచిలో రాళ్లు పుట్టి లేదా నేరేడు పళ్ల సిరప్ త్రాగినా కడతాయి. మూత్రపు సంచిలో రాళ్లు పుట్టే వ్యాధి తగ్గుతుంది. ఈ నేరేడు పండ్లలోగల ఎండిన గింజల చూర్ణాన్ని తగు మోతాదులో కొన్నాళ్ళు పాటు పుచ్చుకున్నట్లయితే డైబిటిస్ వ్యాధి తగ్గుతుంది. పచ్చి గింజల రసాన్ని తగుమోతా దులో రెండు పూటలా కొన్నాళ్ల పాటు పుచ్చు కుంటే ప్లీహరోగం, (ఎన్‌లార్జ్‌మెంట్ ఆఫ్ స్ప్లీన్,) తగ్గుతుంది. అజీర్ణ వ్యాధి నయమవుతుంది.

నేరేడు పళ్లు అధికంగా తింటే గొంతు కకు, రొమ్ముకు నష్టం కల్గుతుంది, ముఖ్యంగా గర్భిణి స్త్రీలు నేరేడు పళ్లు అధి కంగా తినకూడదు. తింటే జబ్బుచేస్తుంది.

నేరేడు పళ్ల యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. శొంఠిచూర్ణం, 2. ఉసి రిక పప్పు, 3. ఉప్పునీటితో కడిగి తినడం.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

పోయింది.

ఇందాకట్నించి తలుపు చాటునించి చూస్తున్న ఆకారం ఆశ్చర్యం లోంచి తేరుకుని ముందుకువచ్చి,

'నిన్న అద్దెకు వచ్చినవాడివి కదూ నువ్వు?' అంది.

గోపాలం తలెత్తి చూసాడు, 'బామ్మగారు!'...

అంతా ఆశ్చర్యంగా చూసారు.

'ఏమిటమ్మా?' అన్నారు రామచంద్రరావుగారు.

జరిగింది విశదీకరించింది బామ్మగారు నవ్వుతూ.

అంతా గొల్లున నవ్వారు.

'ఏమయ్యా, గోపాలం! మీ బామ్మ చచ్చిపోయిందన్నావు, నిక్షేపంలా బతికుందని మీ నాన్న చెప్తున్నాడే' బామ్మగారు జోక్ వేసారు.

అంతా మళ్ళా గొల్లుమన్నారు.

వాళ్ళేం మాట్లాడుకున్నారో గోపాలన్కి వినపళ్ళేదు.

గోపాలాన్కి వినపడిందల్లా, 'రేపు శ్రావణమాసంలో ముహూర్తం పెట్టిస్తా. అప్పటికి అమ్మాయి పరీక్షలు కూడా అయిపోతాయి' అన్న రామచంద్రరావుగారిమాట ఒక్కటే.

* * *

ఈసారి గోపాలం గొల్లున నవ్వాడు.

'ఎలా ఉంది కథ' అన్నాడు నవ్వుతూనే.

'ఏడిచినట్టుంది' అంది జానకి గోపాలాన్ని ఉడికించాలని.

'నువ్వా? నేనా?'

'పోనీ, నేనే'


'నువ్వెంతఏడ్చినా చాలా బాగుంటుంది.'

'మీకు అన్నీ బాగానే ఉంటాయి.'

'సరే! ఇంకోకథ చెప్పనా?'

'బాబోయ్! వద్దు. ఇప్పటికే బోరు కొట్టేసారు. కాఫీ తాగి కాసేపు నిద్రపొండి' అంది శ్రీమతిగార్ల జానకి. ●

# ఆహుతి ఎందుకు చెయ్యాలి?



ధర్మపథం * బులుసు వెంకటరమణయ్య

■ ప్రపంచమంటే ప్రజలు. ప్రజలు లేకుంటే ప్రపంచమే లేదు. గురజాడ మహాకవి 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్!' అని చెప్పిన సంగతి మన వాళ్ళందరికీ తెలుసును.

ఆ మనుషులు జీవించడానికి అత్యంత ముఖ్యమయినది ఏది? అన్నం — అందరూ అన్నమే తింటున్నారా? అనే సందేహం ఎవరికయినా కలగవచ్చును. శరీర పోషణకు తినబడేది అంతా అన్నమే! వరి అన్నం — గోధుమ అన్నం — ఈ మొదలైనదే, అనే నిర్బంధం లేదు. ప్రాణులు జీవించడానికి అన్నం ఎంతో అవసరం.

'అన్నాత్ ఖల్విమాని భూతాని
జాయంతే; జాతా
న్యన్నేన జీవంతి' అని శ్రుతులూ చెప్తున్నవి. ఈ అన్నం లభించడానికి అవసరమైనది వర్షం. అన్నం మనకు సస్యాల మూలంగా లభిస్తుంది. ఆ సస్యాలు వానం మీదనే ఆధారపడి ఉన్నాయి. వర్షాలు లేకపోతే సస్యాలు మలమల మాడిపోతాయి. తిండిగింజలు ఉండవు. అవి లేకపోతే అన్నం ఉండదు.

వర్షాలు ఎలా కలుగుతాయి?

వర్షాలు సూర్యుని మూలంగానే కలుగుతాయనే సంగతి పిన్నల నుండి పెద్దల వరకూ — అందరికీ తెలుసును. సూర్యుడు సముద్రాల్లోనూ, సరస్సులూ మున్నగు వాటిలోను ఉండే జలాలను తన వేడి కిరణాల మూలంగా ఆవిరిగా మార్చునని, అవి మేఘాలుగా ఏర్పడి వర్షాలు కురియునని అందరూ ఎరుగుదురు.

జ్వలించే సూర్యుడికీ — తేజస్సును ప్రసాదించే సూర్యుడికీ, అతని రీతిగానే జ్వలన తేజస్సులతో కూడిన అగ్ని మిత్రుడు. సూర్యుడు, తాను అస్తమించేటప్పుడు తన తేజస్సును అగ్నికి బదిలీ చేస్తాడని అంటారు. అందువల్లనే దీపాలకు రాత్రి వెలుగు ఎక్కువ. ఆ అగ్నిలో ఆహుతులు వేస్తే, అవి తన్మూలంగా సూర్యుణ్ణి చెంది, ఆయనను తృప్తి పరుస్తాయి.

సూర్యుణ్ణి తృప్తి పరచడానికి మనకు మరొక మార్గం లేనందున—అగ్నిద్వారా ఆయనను తృప్తి పరుస్తున్నాము.

మనకు ప్రధాన ప్రత్యక్ష దైవమైన సూర్యదేవుని సంతృప్తికోసమే అగ్నిలో ఆహుతులు చెయ్యడం అవసరమై ఉన్నదని గ్రహించాలి. ఈ విషయాన్నే

అగ్నౌ దత్తాహుతిః సమ్య
గాదిత్య ముపతిష్ఠతే,
ఆదిత్యా జ్జాయతే వృష్టిః
వృష్టేరన్నం తతః ప్రజాః,'

అనే శ్లోకం తెలియజేస్తున్నది.

'అగ్నియందు లెస్సగా చేసిన ఆహుతి ఆ అగ్ని మూలంగా సూర్యుణ్ణి చెందుతుంది. ఆ సూర్యుని వల్లనే వర్షం కలుగుతుంది. వర్షాలవల్ల సస్యాలు పండి అన్నం లభిస్తుంది. ఆ అన్నం వల్ల జీవరాసులు పుట్టడం, జీవించడం, వృద్ధి పొందడం జరుగుతుంది—' అని దీని భావం. ●